సాక్షి ఒడిశా

శుక్రవారం । 21 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.20.093లు, బంగారం 1 గ్రాము, వెండి 10 గ్రాముల 350 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రథయాత్ర విజయవంతం చేయాలి

ఈ ఏడాది జూలై 7న జరగనున్న పూరి శ్రీజగన్నాథుని రథయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య మంత్రి మోహన్ చరణ్ మాఝీ పూరి 36 నియోగుల సంఘం ప్రముఖులను కోరారు.

- 8లో



విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలి

త్వరలో వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని రాయగడ కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సూచించారు.

- 8లో

న్యూస్‌రీల్

రాయగడలో పరమేశ్వర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న జీఎం ఫంక్‌వాల్

రాయగడ: తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ రాయగడలో గురువారం పర్యటించారు. రాయగడ–కొరాపుట్ సెక్షన్లలో మౌలిక సదుపాయాలు, వాటి అభివృద్ధి కార్యాచరణ సామర్థ్యంపై దృష్టి సారించి వివరణాత్మక తనిఖీని నిర్వహించారు. రాయగడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను సమీక్షించి సంబంధిత శాఖ అధికారులతో సమవేశమయ్యారు. ట్రాఫిక్ సౌకర్యాల పనుల పురోగతిని అంచనా వేశారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ముగ్గురు మావోయిస్టులు లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులు

మల్కన్‌గిరి: జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీ ఎదుట ముగ్గురు మావోయిస్టులు స్వచ్ఛందంగా గురువారం లొంగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాకు చెందిన మావోయిస్టులు మల్కన్‌గిరి వచ్చి ఎస్పీ ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం ఎదురు కాల్పుల్లో అధికంగా దిగువ కేడర్ మావోయిస్టులే మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రనేతలు తప్పించుకోవడం కోసం చిన్న కేడర్‌ను బలి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే గిరిజనులను చంపుతున్నారని వాపోయారు. లొంగిపోయినవారిలో దేవ మాడీ, అడ్మా మడ్కమి, ముక్కసోడిలు ఉన్నారు. ఎస్పీ నితీష్ మాట్లాడుతూ.. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరుపున అందాల్సిన సౌకర్యాలు అతి త్వరలో అందజేస్తామని తెలియజేశారు.

యోగా దినోత్సవంపై సమీక్ష



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. స్థానిక కళింగ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు జిల్లా, మహానగర, నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ (ఎన్‌ఏసీ), మండల స్థాయి కార్యక్రమాలు ఉదయం 6 నుంచి 8 గంటల మధ్య జరుగుతాయి. యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా కోరారు. ఈ నేపథ్యంలో ఆయన అధ్యక్షతన గురువారం ప్రత్యేకంగా సన్నాహక సమావేశం నిర్వహించారు.

ప్రాణాలు తీస్తున్న డిఫ్తీరియా...!



చికిత్స పొందిన దీపన్ మెలక (ఫైల్)



మునిషిపాదొరొ గ్రామానికి వెళ్తున్న వైద్య సిబ్బంది (ఇన్‌సెట్లో) టీకాలు వేస్తున్న దృశ్యం

- 15 రోజుల్లో ఐదుగురు చిన్నారులు మృతి
- కంటైన్‌మెంట్ జోన్లుగా పరిసర గ్రామాలు
- శరవేగంగా చిన్నారులకు టీకాలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీ మునిషిపాదొరొ గ్రామంలో పదిహేను రోజులుగా డిఫ్తీరియా బారినపడి ఐదుగురు చిన్నారులు మృతి చెందగా, వివిధ ఆస్పత్రుల్లో మరో 15 మంది చికిత్స పొందుతున్నారు. వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా జిల్లా వైద్య శాఖ మునిషిపాదొరొ గ్రామంతో పాటు బెండియాజొడి, తెంతులిపాదొరొ, ఖమాపాదొరొ, కొడాలిఖాల్, గుముడిముండి గ్రామాలను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించింది. ఐదుగురు చిన్నారులు మృతి చెందడంపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం వ్యాధి నివారణ చర్యలను మరింత ముమ్మరం చేసింది. ఇప్పటికే మునిషిపాదొరొ గ్రామంతో పాటు సమీప గ్రామాలకు వైద్య బృందాలు చేరుకుని, వ్యాధి బారినపడిన చిన్నారుల రక్త నమూనాలను సేకరించి వ్యాధి నిర్ధారణకు సంబంధించి పరీక్షలకు పంపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో డిఫ్తీరియా వ్యాధిగా గుర్తించిన వైద్య ఆరోగ్య శాఖ అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టింది.

దృష్టి సారించని ఆరోగ్య శాఖ

గత నాలుగేళ్లగా కాసీపూర్ సమితిలోని కొండ ప్రాంతాల్లో నివసించే వారికి ఇంతవరకు టీకాలు వేయలేదు సరికదా, అక్కడ ఆరోగ్య విషయాలపై సంబంధిత శాఖ కనీసం దృష్టి కూడా సారించలేదు. నాగరికతకు దూరంగా ఉండే ఈ గ్రామాల్లోని ఆదివాసీలు ఎటువంటి రోగం సంక్రమించినా నాటువైద్యం లేదా గ్రామంలోని దిసారి వంటి వారిపై ఆధారపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటుండడం పరిపాటిగా మారింది. ఏదైనా పెద్ద సంఘటన చోటు చేసుకున్న సమయంలో మాత్రం వైద్య శాఖ భుజాలు తడుముకుని అక్కడకు పరుగులు తీయడం, అందీ అందని చికిత్స చేయడంతో చేతులు దులుపుకోవడం ఈ సమితిలో పరిపాటిగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు పదులు దాటినా ఇప్పటికీ ఈ సమితిలో వైద్య సౌకర్యాలు గగన కుసుమాలే. రహదారులు లేని గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అంతాఇంతా కాదు. గర్భిణులను పురుటి నొప్పులు వస్తే డోలీల్లో మోసుకుంటూ, నదులు, కొండలు దాటుకుంటూ వైద్య కేంద్రాలకు తీసుకెళ్లే సంఘటనలు తరచూ చూస్తున్నవే. ఎంతో మంది గర్భిణులు మార్గమధ్యలో ప్రసవిస్తే, మరికొందరు అభాగ్య తల్లులు సకాలంలో చికిత్స అందక తమ పసికందుల ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు సైతం ఎక్కువే.

గ్రామానికి రోడ్డు నిర్మాణ పనులు

మునిషిపాదొరొ గ్రామంలో జిల్లా యంత్రాంగం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రహదారి నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టింది. డొంగాశిలి పంచాయతీలోని డి.ముర్కా గ్రామం నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరం వరకు రహదారి పనులను చేపట్టింది. జేసీబీ మెషిన్ల ద్వారా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రహదారి నిర్మాణం పనులు పూర్తయితే మౌలిక సౌకర్యాల కల్పనకు వీలుగా ఉంటుందని ముందుగా రహదారి పనులకు యంత్రాంగం చర్యలు తీసుకుంది.

కొరాపుట్ జిల్లాలో ఒకరి మృతి

కొరాపుట్ జిల్లాలో డిఫ్తీరియా వ్యాధితో ఒకరు మృతి చెందారు. రాయగడ జిల్లాలో సంక్రమించి వ్యాధి పొరుగు జిల్లాలో కూడా విలయ తాండవం చేస్తుండడంతో ఈ వ్యాధి బారినపడి కుంబారిపుట్ గ్రామానికి చెందిన దీపన్ మెలక అనే చిన్నారి మృతి చెందింది. ఆదివారం రాత్రి బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్య శాఖ పేర్కొంది. వారం రోజుల క్రితం దీపన్ తీవ్ర జ్వరానికి గురవ్వడంతో అతని తండ్రి సుబ్బారావు మొదట కుంబారిపుట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తీసుకెళ్లాడు. అయితే జ్వర తీవ్రత తగ్గుముఖం పట్టకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఆరు రోజుల క్రితం తీసుకొచ్చాడు. ఇక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి డిఫ్తీరియా సోకినట్లు అనుమానించి మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించాలని సూచించారు. ఈ నేపథ్యంలో దీపన్ తల్లిదండ్రులు వెంటనే బరంపురం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న దీపన్ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించడంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు.

టీకాల ప్రక్రియ ప్రారంభం



వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న ఆరోగ్య కార్యకర్త

డిఫ్తీరియా వ్యాధి తీవ్రతను అదుపులోకి తీసుకొచ్చే ప్రక్రియలో భాగంగా జిల్లా ఆరోగ్య శాఖ బుధవారం నుంచి గ్రామాల్లో చిన్నారులను గుర్తించి టీకాలు వేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఏడాదిలోపు చిన్నారుల్లో 8 మందికి, రెండేళ్ల లోపు ఉన్న చిన్నారుల్లో నలుగురుకి, 5 నుంచి 7 ఏళ్లలోపు గల వారికి 21 మందికి, 10 ఏళ్లకు పైబడిన 15 ఏళ్ల లోపు గల చిన్నారుల్లో 12 మందికి టీకాలు వేశారు. ఈ నెల చివరి నాటికి అన్ని ప్రాంతాల్లోని వారికి టీకాల ప్రక్రియను పూర్తి చేసేందుకు వైద్య శాఖ సన్నాహాలు చేస్తోంది.



టీకాలు వేసేంచేందుకు పిల్లలను తీసుకెళ్తున్న గ్రామస్తులు



శరవేగంగా సాగుతున్న రహదారి పనులు

వ్యాధి అదుపులో ఉంది: కలెక్టర్ మహాజన్

కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని మునిషిపాదొరొ గ్రామంలో 15 రోజుల్లో ఐదుగురు చిన్నారులు అంతుచిక్కని వ్యాధితో మృతి చెందిన సంఘటన చోటుచేసుకోవడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభావిత గ్రామాల్లో 10 వైద్య బృందాలు ఇప్పటికే చికిత్స అందిస్తున్నాయని తెలియజేశారు. ఎప్పటికప్పుడు తాజా సమాచారం తెలుసుకుని పరిస్థితికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఏదిఏమైనప్పటికీ వ్యాధి తీవ్రత తగ్గుముఖం పట్టడంతో పాటు నివారణ చర్యలు ముమ్మరం చేశామని తెలియజేశారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ మాట్లాడుతూ.. సమితిలోని 326 గ్రామాల్లో 89 గ్రామాలకు సరైనన రహదారులు లేకపోవడంతో సకాలంలో వైద్య సేవలను అందించలేకపోతున్నామని పేర్కొన్నారు. సమీప గ్రామాల్లో వ్యాధి వ్యాపించకుండా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

దారుణం

- భార్య గొంతుకోసి హత్య చేసిన భర్త



సంఘటన స్థలంలో జోగి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పోలీసుస్టేషన్ పరిధి కోయికొండ గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. గురువారం ఉదయం భార్య గొంతుకోసి భర్త హత్య చేశాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోయికొండ గ్రామానికి చెందిన నాగసల్బామ్ అనే వ్యక్తితో కలిమెల సమితి కటాన్‌పల్లి గ్రామానికి చెందిన జోగి సల్బామ్ (27)కు 6 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరిద్దరికీ గత కొద్దికాలంగా గొడవలు జరుగుతున్నాయి. అప్పట్లో జోగి తన అన్న ఇంటికి వెళ్లిపోయింది. ఇరు కుటుంబాల పెద్దలు సముదాయించి ఇటీవలే జోగిని భర్త వద్దకు పంపారు. కాగా కొద్ది రోజులు గడిచిన తర్వాత తిరిగి గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఇద్దరూ గొడవ పడ్డారు. అయితే కోపంతో రగిలిపోయిన భర్త నాగ పక నేవున్న కత్తితో ఆమె గొతుకోసి హత్య చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు వెంటనే మోటు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని భర్త నాగను అరెస్టు చేశారు. జోగి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

చురుకుగా రథం పనులు



పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలో గుండిచా రథయాత్ర కోసం చురుకుగా మూడు రథాల పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఒక రథం పనులు దాదాపు పూర్తయ్యాయని రథయాత్ర కమిటీ ప్రధాన కార్యకర్త అశోక్ మహారణా తెలియజేశారు. గురువారం పర్లాకిమిడి సబ్ కలెక్టర్ అనూప్ పండా రథాల తయారీ స్థలం వద్ద పనులను పర్యవేక్షించారు. జూలై 7న రథయాత్ర జరగనుండగా నాలుగు రోజుల ముందే రథాల పనులు పూర్తయ్యేందుకు రాత్రింబవళ్ళు పనిచేస్తున్నామని రథయాత్ర కమిటీ సభ్యులు భరత్ భూషణ్ మహంతి తెలియజేశారు.

రాష్ట్రపతికి శుభాకాంక్షలు



రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ గురువారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

– భువనేశ్వర్

స్పీకర్‌గా సురమా పాఢి

- ఏకగ్రీవంగా ఎన్నిక
- సీఎం, విపక్ష నేతల అభినందనలు



స్పీకర్ సురమా పాఢిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

కొత్త స్పీకర్‌ని అభినందించిన విపక్ష నేతలు నవీన్ పట్నాయక్, తారాప్రసాద్ బాహిణీపతి

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా రొణొపూర్ నియోజకవర్గం నుంచి ఇటీవల ఎన్నికైన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి సురమా పాఢి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రమీలా మల్లిక్ తర్వాత గౌరవనీయమైన సభాపతిగా ఎన్నికైన ద్వితీయ మహిళ కావడం విశేషం. సురమా పాఢి బుధవారం ఈ పదవికి పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేశారు. ఆమెపై పోటీ చేసేందుకు ఏ ఇతర రాజకీయ పార్టీ అభ్యర్థిని నిలబెట్టకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవం అయింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌తో మాట్లాడి ఆమెకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇతర పార్టీల నుంచి ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. సురమా పాఢికి నవీన్ పట్నాయక్ తన పార్టీ మద్దతును తెలియజేసినట్లు శాసనసభా వ్యవహారాల మంత్రి ముఖేష్ మహలింగ్ తెలిపారు. భారతీయ జనతా పార్టీకి 78 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్రుల మద్దతుతో సభలో స్పష్టమైన ఆధిక్యతతో కూడిన బలం ఉంది. బిజూ జనతా దళ్‌కు 51 మంది, కాంగ్రెస్‌కు 14 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ రెండు పార్టీలు ఉమ్మడిగా ప్రతిపక్ష అభ్యర్థిని బరిలోకి దింపిన గెలిచే అవకాశం లేకపోవడం గమనార్హం.

పరాజయాల నుంచి ప్రతిష్ఠాత్మక హోదా

మూడు వరుస పరాజయాల తర్వాత ఇటీవల ముగిసిన ఎన్నికల్లో రొణొపూర్ స్థానం నుంచి సురమా పాఢి విజయం సాధించి శాసనసభకు ప్రాతినిథ్యం అవకాశం పొందారు. ఆమె 15,544 ఓట్ల తేడాతో బిజూ జనతా దళ్‌కు చెందిన సత్యనారాయణ ప్రధాన్‌పై విజయం సాధించారు. నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ – బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో 2004 నుంచి 2009 వరకు సహకార మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 63 ఏళ్ల ఆమె చివరిసారిగా 2004 సంవత్సరంలో రొణొపూర్‌లో గెలిచారు. ఆమె 2000 నుంచి 2002 వరకు భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా, 1998 నుంచి 2000 వరకు మోర్చా రాష్ట్ర విభాగానికి చీఫ్‌గా పని చేశారు. ఆమె రొణొపూర్ నివాసి మరియు కటక్ రెవెన్షా కళాశాల పూర్వ విద్యార్థి. ఈ కళాశాల 1982లో ఆర్ట్స్ విభాగంలో పోస్టు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత సాధించారు. లోగడ బిజూ జనతా దళ్ హయాంలో ప్రమీలా మల్లిక్ తొలి మహిళా శాసన సభ స్పీకర్‌గా రికార్డు ఆవిష్కరించారు. ఆమె 2023 సంవత్సరం సెప్టెంబర్ నెలలో రాష్ట్ర శాసనసభకు మొదటి మహిళా స్పీకర్‌గా విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఆమె కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భారీ డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డంప్‌తో బీఎస్‌ఎఫ్ జవాన్లు

డంప్‌లో నుంచి సామగ్రి వెలికితీస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కూర్మానూర్ పంచాయతీ బెజాంగ్‌వాడ గ్రామ అడవిలో భారీ మావోయిస్టుల డంప్‌ను బీఎస్‌ఎఫ్ జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం రాత్రి బోడిగెట్ట బీఎస్‌ఎఫ్ క్యాంప్ నుంచి జవాన్లు కూంబింగ్‌కు వెళ్లారు. అనంతరం గురువారం మధ్యాహ్నం వారు తిరిగి వస్తున్న సమయంలో భారీ డంప్ గుర్తించారు. దీంతో డంప్‌ను వెలికితీయగా అందులో ఎస్‌బీఎంఎల్ గన్‌లు 3, ఎలక్ట్రిక్ డిటోనేటర్లు 4, సోలార్‌ప్లేట్ 1, బ్యాటరీ ఒకటి, 5 మీటర్ల వైరు, ఎస్‌పీజీ గ్యాస్ సిలిండర్లు 3, స్విచ్‌లు 2, జిలిటెన్ స్టిక్స్ 98, పెద్ద సెలైన్ సీసాలు 10, చిన్న సైజ్ సీసాలు 10 తదితర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ బెజాంగ్‌వాడ ప్రాంతం ఆంధ్ర–ఒడిశా సరిహద్దున ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతం మావోయిస్టుల కంచుకోటగా ఉండేది. ఇక్కడ ఎక్కువగా మావోయిస్టులు స్థావరాలు ఏర్పాటు చేసుకొని సభలు, సమావేశాలు జరిపేవారు. అయితే ప్రస్తుతం ఇక్కడ బీఎస్‌ఎఫ్ జవాన్లు చురుకుగా కూంబింగ్ నిర్వహిస్తుండడంతో మావోల అలజడి తగ్గింది.

క్లుప్తంగా

జీఎస్టీ మండలి సమావేశానికి డిప్యూటీ సీఎం కనకవర్ధన్

భువనేశ్వర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్ దేవ్ న్యూఢిల్లీలో శనివారం జరగనున్న ఆర్థిక మంత్రిత్వ శాఖ బడ్జెట్ ముందస్తు ప్రతిపాదనలు, ద్రవ్య సేవా పన్ను (జీఎస్టీ) మండలి సమావేశానికి హాజరుకానున్నారు.
ఈనెల 22న న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర ఆర్థిక శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆర్థిక శాఖ మంత్రుల సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశంలో భారత పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌ను సిద్ధం చేసే కసరత్తులో భాగంగా రాష్ట్రాలకు చెందిన ఆర్థిక మంత్రులు తమ సూచనలను సమర్పించనున్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ మండలి సమావేశానికి రాష్ట్ర మంత్రులు కూడా హాజరుకానున్నారు.
రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆర్థిక శాఖ బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. తీరిక లేని ముందస్తు కార్యాచరణ ప్రణాళిక నేపథ్యంలో ఆయన కేంద్ర ఆర్థిక శాఖ బడ్జెటు కసరత్తు సమావేశానికి హాజరు కాలేకపోతున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్ దేవ్ ఈ సమావేశానికి ప్రాతినిధ్యం వహిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ప్రకటించింది.


బాలాసోర్‌లో కర్ఫ్యూ పొడిగింపు

భువనేశ్వర్: బాలాసోర్ మున్సిపాలిటీలో కర్ఫ్యూ శుక్రవారం అర్ధరాత్రి వరకు పొడిగించబడింది. స్థానికులకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాత్కాలికంగా 6 గంటల సడలింపు కల్పించారు. ప్రజలకు అవసరమైన వస్తువులు మరియు ఆహార పదార్థాలను కొనుగోలు చేయడానికి సడలింపు వ్యవధిలో అన్ని వాణిజ్య సంస్థలు తెరిచి ఉంటాయని ప్రకటించారు. బాలాసోర్ మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు కళాశాలలు కర్ఫ్యూ సమయంలో మూసివేయబడతాయి. కర్ఫ్యూ వ్యవధిలో ఏ వ్యక్తి అయినా ప్రయాణించడానికి లేదా బహిరంగ ప్రదేశాల్లో తిరగడానికి అనుమతించబడరు. ఈ ప్రాంతంలో ఇంటర్నెట్ 48 గంటల పాటు నిలిపివేయబడుతుంది. బలహీన వర్గాలకు చెందిన మతపరమైన వేడుకలో గోహత్య ఆరోపణలపై రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘర్షణ జరగడంతో మున్సిపాలిటీ ప్రాంతంలో కర్ఫ్యూ విధించబడింది.

'ఆ టీచర్లు పది రోజుల్లో రిపోర్టు చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: దీర్ఘకాలిక సెలవు పెట్టి విధులకు దూరంగా ఉంటూ నిర్దేశిత గడువులోగా విధుల్లో చేరని కారణంగా జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులకు విద్యాశాఖ డెడ్‌లైన్ విధించింది. నరసన్నపేట మండలం గెడ్డవానిపేట ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ పి.గౌరీదేవి, శ్రీకాకుళం రూరల్ మండలం లింగాల ఎంపీపీ స్కూల్ ఎస్‌జీటీ టి.కృష్ణారావులు పది రోజుల్లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తామని డీఈఓ కె.వెంకటేశ్వరరావు స్పష్టంచేశారు. గౌరీదేవి 2021 అక్టోబర్ 18 నుంచి అనుమతి లేకుండా దీర్ఘకాలిక సెలవులు పెట్టగా.. అనేక నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోయిందన్నారు. టి.కృష్ణారావు 2023 జనవరి ఒకటి నుంచి అనుమతి లేకుండా దీర్ఘకాలిక సెలవులో ఉండటం, పలుమార్లు మండల విద్యాశాఖాధికారులు నోటీసులు జారీచేసినా విధులకు హాజరుకాపోవడంతో ప్రవర్తనా నియమావళి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

550 లీటర్ల సారా ఊట ధ్వంసం



ఎర్రమానుగూడలో సారా ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని ఎర్రమానుగూడలో ఎస్ఈబీ బృందాలు గురువారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో 550 లీటర్ల బెం ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం తయారీ నేరమని, గిరిజన యువత భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఎస్ఈబీ పోలీసులు హితవుపలికారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

లుట్టపేటలో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

పొందూరు: మండలంలోని కొంచాడ పంచాయతీ లుట్టపేటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. యువకులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. టి.గోపి ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న యువకులు స్పందించి తాటికమ్మలను తొలగించారు. దీంతో పక్క ఇళ్లకు మంటలు వ్యాపించలేదు. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు, టీవీ, వంట సామగ్రి కాలిబూడిదయ్యాయి.

విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలి

- కలెక్టర్ సత్యవాన్ మహాజన్



మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్, పక్కనే భాస్కరరైతా తదితరులు



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

రాయగడ: త్వరలో వర్షాలు కురవనున్న నేపథ్యంలో ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సూచించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రకృతి వైపరీత్యాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించాలని సూచించారు. గుర్తించిన ప్రాంతంలో తీసుకోవాల్సిన చర్యలు, సమకూర్చాల్సిన సామగ్రి వంటి వాటిని సిద్ధం చేసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాలో 11 సమితుల్లోని అధికారులు, తహసీల్దార్లు, బీడీవోలు ఆయా కేంద్రాల్లో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలన్నారు. వరద బాధిత ప్రాంతాలకు ముందుగానే ఓడ్రాఫ్ట్, అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించాలి

జిల్లా కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించాలని సమావేశంలో పాల్గొన్న కొందరు ప్రముఖులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో కాలువలో మురికి నీరు రోడ్లపై ప్రవహించి, దుర్వాసన వస్తోందని పేర్కొన్నారు. దీంతో రోగాలు సంభవించే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ మహాజన్ స్పందించి పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్నటువంటి డ్రైనేజీలను 15 రోజుల్లోగా శుభ్రపరచాలని ఆదేశించారు. అలాగే వారం రోజుల్లోగా డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను అందించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరైతా తదితరులు పాల్గొన్నారు.

'సహకార సమితి సభ్యుల సంక్షేమానికి కృషి'



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ఒడిశా రాష్ట్ర శ్రామిక సహకార సమితి సభ్యుల సంక్షేమానికి సమితి కృషి చేస్తుందని సమితి డీఏఎం మంగళదాన్ మటమ్ పేర్కొన్నారు. జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి అసన పంచాయతీ కార్యాలయంలో ఒడిశా రాష్ట్ర శ్రామిక సహకార సమితి పంచాయతీ స్థాయి శ్రామిక సమావేశం గురువారం జరిగింది. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 314 సమితిల్లోని 7000 పంచాయతీల్లో ఒక్కొక్క ఎస్ఎస్ మార్ట్ దుకాణం తెరువబడుతుందని వెల్లడించారు. రాష్ట్రంలోని శ్రామిక సహకార సమితిలో సభ్యులందరికీ బజారు ధరల కన్నా 15 శాతం నుంచి 50 శాతం తక్కువ ధరకు రేషన్ సామగ్రి, దుస్తులు మొదలగు వస్తువులు సమకూర్చుతామని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలు, ప్రభుత్వ విధుల్లో ఉన్నవారు ప్రమాదాలకు లోనైనా వారికి ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని వెల్లడించారు. ఒకవేళ ఎవరైనా మరణిస్తే వారి కుటుంబంలో మైనర్లకు 10 ఏళ్లపాటు ఉచితంగా రేషన్ మొదలగు సౌకర్యాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో కుంద్ర సమితి శ్రామిక సహకార సమితి బీఎం ఉపేంద్ర కుమార్ సాహు, అసన పంచాయతీ సర్పంచ్ జయంతి కుసపొరియ, నాయబ్ సర్పంచ్ రాం సింగ్ గౌఢ, ఒడిశా రాష్ట్ర శ్రామిక సహకార సమితి కార్య నిర్వాహక అదనపు బ్రాంచ్ మేనేజర్ దేబాసిస్‌త్రిపాఠీ, పీఈవో నిరంజన్ పాణి తదితరులు పాల్గొన్నారు.

రథయాత్ర విజయవంతం చేయాలి



ప్రసంగిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

- సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: ఈ ఏడాది జూలై 7న జరగనున్న పూరి శ్రీజగన్నాథుని రథయాత్రను శాంతియుతంగా, సజావుగా పూర్తిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పూరి 36 నియోగుల సంఘం ప్రముఖులను కోరారు. ఈ మేరకు స్థానిక రాష్ట్ర అతిథి గృహంలో గురువారం ప్రత్యేక సమావేశంలో అనుబంధ వర్గాలతో ముఖ్యమంత్రి ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో 36 నియోగ్ సభ్యులు పూర్తి సహకారాన్ని ముఖ్యమంత్రికి అందజేస్తామని హామీ ఇచ్చారు. యాత్ర విజయవంతం సంకల్పంతో కొత్త ప్రభుత్వం సేవకుల సమన్వయం అభ్యర్థించడంపై నియోగుల ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీ మందిరానికి రూ.500 కోట్ల కార్పస్ నిధి ఏర్పాటు చేసినందుకు వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రథయాత్రను సజావుగా పూర్తి చేయాలని న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా సమావేశానికి విచ్చేసిన సేవకులకు స్వాగతం పలికారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ: పలాస జీఆర్‌పీ పరిధిలోని పూండి రైల్వేస్టేషన్ ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి గురువారం అపస్మారక స్థితిలో కనిపించాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్సుకు సమాచారం అందించడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యసేవలు అందిస్తుండగా మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్ల ఉంటుందని తెలిపారు. శ్రీకాకుళం, ఆమదాలవలస ప్రాంతాలకు చెందినవాడిగా అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవదాయ మంత్రిని కలిసిన అరసవల్లి ఈఓ

అరసవల్లి: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు చేపట్టిన ఆనం రామనారాయణరెడ్డిని అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదిత్యుని చిత్రపటాన్ని మంత్రికి అందజేశారు.

ఇంటర్ విద్యార్థుల ఘర్షణ

నరసన్నపేట: స్థానిక కంబకాయ రోడ్డులోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్, సెకెండియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ విద్యార్థులు తోట ప్రదీప్, బొమ్మళి దేవకుమార్ మధ్య బుధవారం ఘర్షణ చోటుచేకుంది. ఈ గొడవ గురువారం విద్యార్థుల స్నేహితులు, కుటుంబ సభ్యులకు చేరింది.ఈ క్రమంలో సాయంత్రం గొట్టిపల్లి వంతెన వద్ద రెండు వర్గాలు ఒకరికొకరు కొట్టుకున్నారు. ఈ ఘటనలో పురుషోత్తంనగర్‌కు చెందిన అరుణ్, రోనక్, చీపురు సూర్య, గుణశేఖర్‌లు గాయపడటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామాని కి చెందిన మైలపల్లి లక్ష్మణరావు (29) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. జె.ఆర్.పు రం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణరావు పైడిభీమవరంలో కొంతమంది వద్ద అప్పులు చేసి వాటిని తీర్చలేక కోష్టలోని శ్రీకృష్ణ చైతన్య మందిరం సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో తలదాచుకుంటున్నాడు. సోమ వారం వరకు భార్యాభర్తలిద్దరూ కోష్టలోనే ఉన్నారు. ఈ నెల 18న ఉద యం భార్య సౌందర్య పైడిభీమవరంలోని బీసీ కాలనీలో ఉంటున్న ఇంటికి వెళ్లిపోయింది. ఆ రోజు రాత్రి 11 గంటల వరకు భార్యతో ఫోన్‌లో మాట్లాడి న లక్ష్మణరావు బుధవారం రోజంతా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. అప్పుల వారు చేస్తున్నారనే ఉద్దేశంతో ఫోన్ లిఫ్ట్ చేయలేదని భావించిన భార్య గురువారం ఉదయం అపార్ట్‌మెంట్‌కు వచ్చింది. గది లోపల గడియపెట్టి ఉండటంతో వాచ్‌మన్ సహాయంతో తలుపు తీయగా లక్ష్మణరావు ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. తీవ్రమైన దుర్వాసన రావడంతో మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. లక్ష్మణరావుకు భార్య, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఏఎస్సై రమణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డుకు చెక్ అందజేత

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా హోమ్ గార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించి ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు గొర్లె రాజుకు సహచర హోమ్‌గార్డులు ఒక్కరోజు గౌరవ వేతనం సుమారు రూ. 4.17లక్షల చెక్కును గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, ఆర్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ఘటాల వద్ద భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాయగడ: గ్రామ దేవత బురదల పోలమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్డు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డులో నిలిపిన అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలకు పండ్లు, పసుపు, కుంకుమలు సమర్పించుకుని అమ్మవారి ఆశీర్వాదం పొందేందుకు భక్తులు బారులుతీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



తాత్కాలిక షెడ్డులో బారులుతీరిన భక్తులు

జేకేపూర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న మిల్ ఉద్యోగులు, సిబ్బంది

రాయగడ: సదరు సమితి పరిధి జేకేపూర్‌లోని జేకే పేపర్ మిల్ ప్రాంగణంలో జేకే సంస్థల మాజీ అధ్యక్షుడు హరిశంకర్ సింఘానియా 91వ జయంతిని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మిల్ కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా ఈ శిబిరంలో పాల్గొని 200 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మానవతా దృక్పథంతో అంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరినీ అభినందించారు. జేకే పేపర్ మిల్ ఆరోగ్య కేంద్రానికి చెందిన ముఖ్యవైద్యాధికారి డాక్టర్ కేవీఆర్ రావు, డాక్టర్ పద్మా యశ్వంత్‌లు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా పూర్తిచేశాం

- మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా
- నెలవారీ సమీక్షలో ఎస్పీ రాధిక



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా పూర్తిచేశామని, ఎక్కడా అల్లర్లు, ఘర్షణలకు తావులేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేశారని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నియంత్రించాలని ఆదేశించారు. కొత్త వ్యక్తుల సమాచార సేకరణ, అనుమానిత వ్యక్తులపై నిఘా, లాడ్జీలు, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేసి నేర నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి నిందితులపై చార్జిషీటు దాఖలు చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు యర్రగుంట శృతి(శ్రీకాకుళం), డి.బాలచంద్రారెడ్డి (టెక్కలి), నాగేశ్వరరెడ్డి (కాశీబుగ్గ), ఎల్.శేషాద్రినాయుడు (ఏఆర్), ఎ.త్రినాధరావు (స్పెషల్‌బ్రాంచి), కె.శ్రీనివాసన్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అధికారులకు ప్రశంసాపత్రాలు..

ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో కృషిచేసిన పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రశంసాపత్రాలు అందజేశా రు. ప్రశంసాపత్రాలు అందుకున్నవారిలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు యర్రగుంట శృతి(శ్రీకాకుళం), డి.బాలచంద్రారెడ్డి (టెక్కలి), నాగేశ్వ రరెడ్డి (కాశీబుగ్గ), ఎల్.శేషాద్రినాయుడు (ఏఆర్), ఎ.త్రినాధరావు (స్పెషల్ బ్రాంచి), ఆర్.శ్రీనివాస రావు (దిశా) లే కాక సీఐలు ఎల్.సన్యాసినాయుడు (శ్రీకాకుళం రూరల్), ఎం.అవతారం (ట్రాఫిక్), టి.నిర్మల (ఎలక్షన్ సెల్), ఎస్ఐలు ఎం.ప్రవల్లిక (ఎలక్షన్ సెల్), సత్యనారాయణ (పోలాకి), ఏఓ గోపినాథ్, ఆర్ఐ రమేష్, ఏఎస్ఐ రమేష్, ఎలక్షన్ సెల్ కానిస్టేబుళ్లు సంతోష్‌కుమార్, సింహాచలం ఉన్నారు.

'అనాథ బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి'



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి బిద్యాధర పృస్టి తదితరులు

జయపురం: అనాథ బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు జడ్జి బిద్యాధర పృస్టి బాలాశ్రమ నిర్వాహకులకు సూచించారు. ఈ మేరకు న్యాయాధికారులతో కలిసి జయపురంలో ఉత్కళ బాలాశ్రమాన్ని సందర్శించారు. ఆయన బాలాశ్రమంలో స్థితి గతులను అధ్యయనం చేశారు. ముఖ్యంగా వారికి పెడుతున్న భోజన నాణ్యత, ఆశ్రమ పారిశుధ్యం, విద్య, వైద్య సౌకర్యం మొదలగు విషయాలపై ఆశ్రమ నిర్వాహకులతో చర్చించారు. ఆశ్రమ పిల్లలకు రక్షణ కల్పించటంతో పాటు గుణాత్మక విద్య బోధించాలన్నారు. వారి కోసం పలు చట్టాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం చిన్నారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్రో, సమితి సామాజిక సంక్షేమ సురక్షా అధికారి కె.ఎస్.నిశా తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు బలి



వెంకటసత్యనారాయణ మృతదేహం



దేవరపల్లి బారికయ్య మృతదేహం

బూర్జ: మండలంలో వేర్వేరు గ్రామాల్లో గురువారం పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. అయ్యవారిపేటకు చెందిన చోడవరపు వెంకటసత్యనారాయణ (29) గ్రామ పరిధిలోని పొలాల వైపు ఆవుల ను మేపేందుకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఒక్కసారి గా వర్షం మొదలవడంతో చెట్టు కిందకు వెళ్లాడు. ఆ సమయంలో పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనతో పాటు రెండు ఆవులు కూడా మృతి చెందాయి. వెంకట సత్యనారాయణకు ఇంకా వివాహం కాలేదు. తండ్రి చోడవరపు సూర్యనారాయ ణ, తల్లి అచ్చుతమ్మ ఉన్నారు. అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన మామిడి ధనుంజయరావు కూడా పిడుగుపాటుకు గురై స్వల్పంగా గాయపడటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలలించారు.

కటకమయ్యపేటలో..

తమ్మినాయుడుపేట పంచాయతీ కటకమయ్యపేటలో దేవరపల్లి బారికయ్య(63) పొలం పనిచేస్తుండగా పిడుగు పడటంతో ఘటనా స్థలం వద్దే మృతి చెందా డు. ఈయనకు భార్య అమ్మన్నమ్మ, కుమారుడు, ఇద్ద రు కుమార్తెలు ఉన్నారు. స్థానిక వీఆర్వోలు ఉమ, పోలుపల్లి సమాచారం మేరకు ఎస్సై జి.వి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాల ను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్‌కు తరలించారు.

నేటి నుంచి డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్ కమిటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలను శుక్ర, శనివారాల్లో అఫిలియేషన్ కమిటీలు పరిశీలించనున్నాయి. వర్సిటీ పరిధిలో ఉన్నత విద్యకు సంబంధించి 106 కళాశాలలు ఉండగా, అందులో డిగ్రీ కళాశాలలు 87 ఉన్నాయి. ముందుగా డిగ్రీ కళాశాలల పరిశీలనకు అఫిలియేషన్ బృందాలు వేశారు. బీఎడ్, బీపీఈడీ, డీపీఈడీ, లా కోర్సుల పరిశీలనకు నిపుణులతో కమిటీలు వేయాల్సి ఉంటుంది. డిగ్రీ కళాశాలల పరిశీలనకు 17 బృందాలు నియమించారు. ఇందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్థాయి అధికారి, సీనియర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఇద్దరు ఉంటారు. ఒక్కో కమిటీ ఐదు కళాశాలలు పరిశీలిస్తుంది. ఇందుకోసం ఉన్నత విద్యా మండలి ప్రత్యేక యాప్ రూపొందించింది. ఈ యాప్‌లో భౌతికంగా పరిశీలించిన కమిటీ సభ్యులు, పరిశీలించిన దృశ్యాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించిన కళాశాలలకు అనుమతులు కొనసాగిస్తారు. పర్యాలేదన్న కళాశాలలకు షరతులతో కూడిన అనుమతులు ఇస్తారు. కనీస ప్రమాణాలు లేని కళాశాలకు అనుమతులు తిరస్కరిస్తారు. ప్రధానంగా సొంత భవనాలా? లీజ్ భవనాలా, క్రీడా మైదానం, తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్‌లు, టాయిలెట్లు, కొత్త కోర్సులకు దరఖాస్తు చేస్తే అదనపు వసతులు ఉన్నాయా?ఫ్యాకల్టీ, విద్యార్హతలు, అనుమతులు తీసుకున్న చిరునామాలో కళాశాల నిర్వహిస్తున్నారా? ఫైర్ అండ్ సేఫ్టీ పరిస్థితి, ప్రవేశాలు, విద్యార్థుల ఉత్తీర్ణత వంటి అంశాలు పరిశీలిస్తారు. ఉన్నత విద్యా మండలి నిబంధనలు పాటించే కళాశాలలకు అనుమతులు ఇవ్వటం, జూలై ఒకటి తరువాత ప్రవేశాలుపై దృష్టిపెట్టటం వంటి అంశాలు పరిశీలిస్తుంది. ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు అఫిలియేషన్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత తెలిపారు. అర్హత ఉన్న కళాశాలలకు ప్రవేశాల అనుమతులు మంజూరు ఉంటుందని చెప్పారు.

ఇంటర్ విద్యార్థుల ఘర్షణ

నరసన్నపేట: స్థానిక కంబకాయ రోడ్డులోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్, సెకెండియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ విద్యార్థులు తోట ప్రదీప్, బొమ్మళి దేవకుమార్ మధ్య బుధవారం ఘర్షణ చోటుచేకుంది. ఈ గొడవ గురువారం విద్యార్థుల స్నేహితులు, కుటుంబ సభ్యులకు చేరింది.ఈ క్రమంలో సాయంత్రం గొట్టిపల్లి వంతెన వద్ద రెండు వర్గాలు ఒకరికొకరు కొట్టుకున్నారు. ఈ ఘటనలో పురుషోత్తంనగర్‌కు చెందిన అరుణ్, రోనక్, చీపురు సూర్య, గుణశేఖర్‌లు గాయపడటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

23న జాబ్ మేళా

పార్వతీపురం: కేఎల్ గ్రూప్ కన్సల్టెన్సీ, అమెజాన్ సంస్థ సంయుక్తంగా ఈనెల 23న మెగా జాబ్‌మేళాను పార్వతీపురంలోని భాస్కర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు భాస్కర్ విద్యాసంస్థల అధినేత చుక్క భాస్కరరావు గురువారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎస్‌కె సేఫ్టీవింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 35ఏళ్ల లోపు ఉన్న స్త్రీ పురుషులు, పదోతరగతినుంచి డిగ్రీ వరకు చదివిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

27న ప్రవేశ పరీక్ష

బాడంగి: విజయనగరం, పార్వతీపురం జిల్లాల పరిధుల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 27వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు స్థానిక గురుకులం ప్రిన్సిపాల్ టి.రామదాస్ గురువారం తెలిపారు. గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ టి.పద్మజ ఆదేశాల మేరకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని, ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ పరీక్ష నిర్వహించి, మెరిట్ విద్యార్థులకు కోరుకున్న పాఠశాల లో సీటు కేటాయించడం జరుగుతుందన్నారు.

పుస్తెల తాడు చోరీ

సీతానగరం: మండలంలోని జోగింపేటలో ఓ ఇంట్లో పరుపు కింద ఉన్న 35 గ్రాముల పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి బుధవారం అర్ధరాత్రి చోరీ చేసినట్లు పోలీసులు తెలియజేశారు.ఈ మేరకు ఎస్సై ఎం.రాజేష్ గురువారం మాట్లాడుతూ తన ఇంటి వరండాలో బుధవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఎవరోగుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో ఉన్న పరుపు కింద దాచిన పుస్తెలతాడు, బీరువాలో నగదును అపహరించుకు పోయారని జోగింపేట సర్పంచ్ కల్యంపూడి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నదిపై బూర్జ రేవు నుంచి గురువారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బూర్జ రేవులోంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు ఉన్నతాధి కారులనుంచి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పరిశీలించగా ఇసుక ట్రాక్టర్లు నాలుగు ఉన్నట్లు గుర్తించి డ్రైవర్లతో పాటు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగారం

డెంకాడ: మండలంలో జరిగిన ఓ హత్యకేసులో విచారణ అనంతరం ముద్దాయి బొల్లు వెంకటరమణకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి బి.కల్యాణ చక్రవర్తి తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ ఎం.దీపిక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. 2020వ సంవత్సరంలో డిసెంబర్ 4వ తేదీన కుటుంబ తగాదాల నేపథ్యంలో డెంకాడ మండ లంలోని సింగవరం గ్రామానికి చెందిన బావన సురేష్ అనే వ్యక్తిని బావ అయిన బొల్లు వెంకటరావు గ్యాస్ సిలిండర్‌తో బలంగా కొట్టడంతో తీవ్రగా యాలపాలై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ 2020వ సంవత్సరం డిసెంబర్ 8వ తేదీన బావన సురేష్ మరణించినట్టు బొల్లు అమ్మాజీ డెంకాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి ఎస్సై బి.సాగర్‌బాబు కేసు నమోదు చేయగా, సీఐ సీహెచ్ శ్రీధర్ దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. ఈ కేసును ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి బి.కల్యాణ చక్రవర్తి విచారణ చేసి ఈనెల బొల్లు వెంకటరావును దోషిగా నిర్ధారిస్తూ తీర్పునిచ్చా రు. కేసును భోగాపురం సీఐ టీవీ వెంకటేశ్వరరావు, డెంకాడ ఎస్సై ఎం.కృష్ణమూర్తి పర్యవేక్షించగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం వాదనలు వినిపించారు.

జూలై 1న జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత శిక్షణకు జూలై 1న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని నైరెడ్ డైరెక్టర్ రాజేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 40 సంవత్సరాల లోపు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పురుషులకు హౌస్ వైరింగ్ అండ్ ఫ్యాన్ రివైండింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్‌లలో (30 రోజులు) శిక్షణ ఉంటుందన్నారు. అలాగే మహిళలకు హోమ్ నర్సింగ్, లేడీస్ టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ (30 రోజులు)లో శిక్షణ ఇవ్వనున్నామని, 10వ తరగతి పాసై ఉండాలని, లేడీస్ టైలరింగ్‌కు మాత్రమే 5వ తరగతి అర్హతగా నిర్ధారించామని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూకు హాజరుకానున్న అభ్యర్థులు 10వ తరగతి ఒరిజినల్ మార్కుల లిస్టు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఇతర విద్యార్హతగల సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు జూలై 5 నుంచి శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129, 9866913371, 6304626372 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

కొమరాడ: గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్యసిబ్బందిని ఆదేశించారు. చినఖేర్జిలలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల లార్వా స్థావరాలైన మురుగు కాల్వలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో మలేరియాను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ విజయకుమారి, సూపర్ వైజర్ జయగౌడ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



యోగా శరణం గచ్ఛామి

అనవసరమైన ఒత్తిళ్లతో మానసికంగా కుంగిపోతున్నారా? చిన్నచిన్న అనారోగ్య సమస్యలతో పనిమీద శ్రద్ధ చూపలేకపోతున్నారా? మనస్సు కోరుకున్న విశ్రాంతి తీసుకోలేకపోతున్నారా? మంచి నిద్ర కరువవుతోందా? అందమైన శరీరాకృతి కావాలనుకుంటున్నారా? అయితే మరెందుకాలస్యం. పై సమస్యలన్నీ పోగొట్టే మార్గం యోగా విద్య. ఈ విద్యలో ధ్యానం, శ్వాసమీద ధ్యాస, ఆసనాలు వేయడం వల్ల శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా, ఆరోగ్యవంతులుగా, ఉన్నతులుగా మారొచ్చని ప్రాచీన యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. యోగ విద్యను ఆశ్రయిస్తే సమస్య రోగాల నుంచి విముక్తి కలగడంతో పాటు మంచి ఆరోగ్య వంతులుగా చలాకీగా చురుగ్గా ఉండే అవకాశం లభిస్తుందని యోగా గురువులు బోధిస్తున్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలువురు యోగా గురువుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

– వీరఘట్టం, పార్వతీపురం టౌన్, రాజాం సిటీ, పాలకొండ, జామి, విజయనగరం టౌన్

- బిజీ జీవితంలో చుట్టుముడుతున్న రోగాలు
- కరువవుతున్న శారీరక, మానసిక ప్రశాంతత
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



రాజాం సిటీ: యోగా శిక్షణకు హాజరైన చిన్నారులు (ఫైల్)

శరీరానికి హెల్త్ ప్యాకేజీ యోగా

మానసికంగా, భావోద్వేగాల పరంగా సమతుల్యంగా ఉన్నప్పుడే శరీరం ఆరోగ్యంగా ఉన్నట్లు. ఎంత సంతోషంగా, ఉల్లాసంగా జీవిస్తున్నారనేదే కొలమానం. ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం అన్నీ కలిసి ఆరోగ్యానికి ఒక హెల్త్ ప్యాకేజీగా యోగా తోడ్పతుంది.

కె. వెంకటరమణ, యోగాగురువు, సాయి యోగా కేంద్రం, పార్వతీపురం

యోగాసనాలతో పూర్తి ఆరోగ్యం

యోగా శిక్షణను జాతి, మత కులం వంటి భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ పొందుతున్నారు. యోగా చేయడం వల్ల శరీరమంతా దృఢంగా ఉంటుంది. శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలో యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది. యోగా ద్వారా మేధాశక్తి పెరగడమే కాకుండా మనుషులను మంచిమార్గంలో నడిపించే ఆలోచనలు వస్తుంటాయి.

–అధికారి సింహాచలం, యోగాగురువు, నారాయణ యోగా కేంద్రం, పార్వతీపురం

ఆత్మస్థైర్యం పెరుగుతుంది



యోగా సాధనతో ఎంతటి సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మస్థైర్యం అలవడుతుంది. విద్యార్థి దశ నుంచే యోగా సాధనతో క్రమశిక్షణ పెరుగుతుంది. ప్రతి ఒక్కరు యోగాపై అవగాహన పెంచుకోవాలి. యోగాతో కొన్ని రోగాలు దూరం కావడంతోపాటు మానసిక ప్రశాంతత కలుగుతుంది.

టీటీవీ రమణమూర్తి, యోగా గురువు

మంచి ఆరోగ్యం



యోగాతో మంచి మానసిక ఆరోగ్యం సాధ్యం. మా ఇంటిల్లిపాది ప్రతి రోజూ యోగా చేస్తాం. శారీరక వికాసంతో పాటు మానసిక వికాసం ఏర్పడుతుంది. ఒత్తిడిని అధిగవించవచ్చు.

గడే అప్పలనాయుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రాజాం

విద్యార్థులకు తప్పనిసరి



మా పాఠశాలలో వారంలో ఒకరోజు యోగా తరగతులు ఉంటాయి. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా యోగాలో పాల్గొంటున్నారు. శారీరక వికాసానికి యోగా ఎంతో దోహదపడుతుంది. యోగా చేయడం ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసం పెరుగుతుంది.

కె.సన్నిబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు జెడ్‌పీహెచ్ స్కూల్, సిరిపురం, సంతకవిటి మండలం



వీరఘట్టం: యోగాసనాలు వేస్తున్న కేజీబీవీ బాలికలు (ఫైల్)



వీరఘట్టం: చిట్టపులివలస స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు (ఫైల్)

యోగాలో గౌరి ప్రతిభ



జామి: రాజకపూత ఆసనం వేస్తున్న చిన్నారి గౌరి

జామి: మండలంలో విజినిగిరి గ్రామానికి చెందిన చిన్నారి కె.గౌరి అనేక క్లిష్ట తరమైన ఆసనాలు వేయడంతో పాటు పతంజలి యోగ సూత్రాలు అన్ని అలవోకగా వినిపిస్తుంది. గౌరి ప్రస్తుతం 8వ తరగతి చదువుతోంది. తండ్రి కొవ్వాడ శ్రీనివాసరావు ప్రోత్సాహంతో యోగ సాధనపై దృష్టి సారించింది. ఎటువంటి ఆసనాలైనా అవలీలగా ఈచిన్నారి వేస్తుంది. తండ్రి వద్దే యోగ విద్యను అభ్యసిస్తోంది. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగే పనిచేయడమే కాకుండా అనేక మందికి యోగ విద్యను నేర్పించారు.



రాజాం సిటీ: వికాసతరంగిణి ఆధ్వర్యంలో ఉచిత యోగా తరగతులు



పార్వతీపురం టౌన్: యోగాసెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏకాగ్రత పెరుగుతుంది



గురుదేవులు రావర్తి రామారావు శిక్షణలో యోగభ్యాసంలో ఉన్నత ఫలితాలు పొందగలిగాను. భారతప్రధాని మోడీ ప్రారంభించిన ఇంటర్నేషనల్ యోగా డే ఒక గొప్ప సంప్రదాయం. ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తితో పాటు మెదడు చురుగ్గా పనిచేస్తుంది. రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. బీపీ, షుగర్ వంటి వ్యాధులు దూరమవుతాయి. శరీరం ఎంతో ఆరోగ్యంగా తయారవుతుంది. ప్రతిరోజూ యోగా చేయడం ఓ అలవాటుగా మార్చుకోవాలి.

– ఉషారాణి, యోగా గురువు, విజయనగరం

ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ సేవలు

- ఎయిర్, రైల్వే సేవలను సద్వినియోగం చేసుకోండి
- ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి



టూరిజం ప్యాకేజీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ క్రాంతి పి.సావర్కర్, తదితరులు

విజయనగరం టౌన్: ఐఆర్‌సీటీసీ అందిస్తున్న ఎయిర్, రైల్వే సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ జాయింట్ జనరల్ మేనేజర్ డాక్టర్ క్రాంతి పి.సావర్కర్ కోరారు. విజయనగరం రైల్వేస్టేషన్ వీఐపీ లాంజ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో యాత్రా విశేషాలను వివరించారు. ఇంటర్నేషనల్ ఎయిర్ ప్యాకేజీ ద్వారా మేజికల్ థాయ్‌లాండ్ పర్యటన అందిస్తున్నామన్నారు. సదరన్ డివైన్ టెంపుల్ టూర్, తిరుపతి బాలాజీ దర్శన్, రాయల్ రాజస్థాన్, లేలడక్, చార్‌ధామ్, గుజరాత్ ప్యాకేజీ, అండమాన్ ప్యాకేజీలను వివరించారు. జూలై 26న మానస్‌ఖండ్ యాత్రను భారత్ గౌరవ్ టూరిస్టు ట్రైన్ ద్వారా పది రాత్రులు, 11 రోజులు పాటు ఉత్తరఖండ్‌లో ఉన్న 11 ప్రదేశాలను ప్రయాణికులు తిలకించవచ్చన్నారు. వివరాలకు సెల్: 95501 66168, 92814 36280 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో టూరిజం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంఘమిత్రరౌల్, స్టేషన్ మేనేజర్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో విజ్ఞానం



పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ నోడల్ టీచర్లు

- డీఈఓ ఎన్.ప్రేమకుమార్



మాట్లాడుతున్న డీఈఓ ఎన్.ప్రేమకుమార్

విజయనగరం అర్బన్:

విద్యార్థుల్లో వైజ్ఞానిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు 'అటల్ టింకరింగ్ ల్యాబ్'లు దోహదపడతాయని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ అన్నారు. స్థానిక ప్రైవేటు పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 42 ఉన్నత పాఠశాలల్లో ఈ ల్యాబ్‌లు ఉన్నాయని, వీటి పనితనాన్ని నిర్ధారించేందుకు ఇచ్చిన 13 సూచికలను ప్రతి హెచ్‌ఎం పాటించాలన్నారు. సూచికల ఆధారంగా ల్యాబ్ పనితనానికి రేటింగ్ ఇస్తూ పాయింట్లు ఇస్తామని చెప్పారు. 13 సూచికలు విజయవంతంగా అమలు చేసిన పాఠశాల ల్యాబ్‌కు ఐదు పాయింట్లు ఇస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రతినెలా కలెక్టర్ సమక్షంలో సమీక్ష సమావేశం ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ మిరియాల కృష్ణారావు, ల్యాబ్ ప్రధాన ఉపాధ్యాయులు, ల్యాబ్ నోడల్ టీచర్లు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్‌గా వి.రమేష్ వ్యవహరించారు.

రూ.128కోట్లతో పార్వతీపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి



పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పన్వాల్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం రైల్వే స్టేషన్‌ను అమృత్‌భారత్‌లో భాగంగా రూ.128 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్టు ఈస్టుకోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పన్వాల్ అన్నారు. విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్‌తో కలిసి పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో విజయనగరం రైల్వే స్టేషన్ తరువాత పార్వతీపురం రైల్వే స్టేషన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడించారు. రైల్వేస్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫాంలకు వెళ్లేందుకు వంతెన నిర్మాణాలు చేపట్టామన్నారు. 6 నెలల్లోగా ఆయా ప్లాట్‌ఫాంలకు వెళ్లే ప్రయాణికులకు లిఫ్టులు, ఎస్కలైటర్ల సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రయాణికుల సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యంగా రైల్వేశాఖ పనిచేస్తోందన్నారు. త్వరితగతిన రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రైల్వే అధికాలరులు పాల్గొన్నారు.

కనిపించకుండా పోయిన వ్యక్తి మృతి



మృతిచెందిన కృష్ణ (ఫైల్)

బొండపల్లి: మూడు రోజులుగా అదృశ్యమైన వ్యక్తి మామిడితోటలోని తుప్పల్లో మృతదేహమై కనిపించాడు. గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనపై ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన మజ్జి కృష్ణ(32) ఈనెల 17న ఉదయం భార్య ఈశ్వరమ్మ దగ్గర 400 రుపాయలు తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. వంటవాడిగా పని చేస్తూ మద్యానికి బానిసైన కృష్ణ కొద్ది రోజులుగా పనికి వెళ్లకుండా కుటుంబసభ్యులను వేధిస్తున్నాడు. 17న ఉదయం డబ్బులు తీసుకోని ఇంటి నుంచి వచ్చేసి అక్కడ నుంచి కనపడకపోవడంతో కుటుంబసభ్యులు వెతికే పనిలో పడ్డారు. ఈ క్రమంలో రయింద్రం గ్రామానికి సమీపంలోని తుప్పల్లో తీవ్ర దుర్గంధంతో కృష్ణ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. మృతుని భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పాము కాటుతో మహిళ మృతి



కళావతి (ఫైల్)

గుర్ల: మండలంలోని నడుపూరుకు చెందిన కర్రోతు కళావతి(39) పాముకాటుతో గురువారం మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కళావతి ఉదయం పచ్చగడ్డి కోయడానికి పొలానికి వెళ్లింది. గడ్డి కోసి తిరిగి ఇంటికి వస్తుండగా గట్టుపై నడుస్తున్న సమయంలో కుడి కాలుపై పాము కరవడం గమనించి చుట్టుపక్కల రైతులకు చెప్పింది. దీంతో ఆమెను వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె భర్త అక్కునాయుడు ఫిర్యాదు మేరకు ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కిశోర్ మృతదేహం

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామంలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు స్థానిక పోలీసులు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురంలో ఫైర్‌మన్‌గా పనిచేస్తున్న గ్రామానికి చెందిన గుడిమెట్ల కిశోర్ (38 ఇంట్లో ఫ్యాన్‌కు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఉరివేసుకున్నట్లు గురువారం మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు చేసింది. భార్యతో తరచూ వస్తున్న గొడవలు, అప్పుల కారణంగా మద్యం మత్తులో మనస్తాపానికి గురై ఉరివేసుకున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

ఈ మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం రతలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారని పోలీసులు తెలియజేశారు.

విత్తన శాంపిల్స్ సేకరణలో అలసత్వం

- ఇప్పటికే విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు
- జిల్లాలో వరి పంట సాధారణ విస్తీర్ణం 90 వేల హెక్టార్లు



వరి విత్తనాలు

విజయనగరం ఫోర్ట్: విత్తుబాగుంటేనే పంట దిగుబడి బాగా వస్తుందన్నది నానుడి. నాణ్యమైన విత్తనంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి కూడా వస్తుంది. తెగుళ్లు, చీడపీడల సమస్య కూడా ఉండదు. విత్తనంలో నాణ్యత లేకపోతే చీడపీడల బెడదతో పాటు పంట దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోతుంది. దీని వల్ల రైతులు నష్ట పోవాల్సిన పరిస్థితి. అంతటి ప్రాధాన్యం గల విత్తనాలు నాణ్యమైనవో, కాదో తెలుసుకునేందుకు ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విక్రయించే విత్తనాల నుంచి శాంపిల్స్ సేకరిస్తారు. అయితే ఈఏడాది విత్తన శాంపిల్స్ సేకరణలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. శాంపిల్స్ సేకరణ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉన్నా ఇప్పటి వరకు సగం కూడా శాంపిల్స్‌ను వ్యవసాయ అధికారులు సేకరించలేదు.

ఖరీఫ్ శాంపిల్స్ లక్ష్యం 350

రైతులు ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి 1.25 లక్షల హెక్టార్ల వరకు సాగు చేస్తారు. ఇందులో 90 వేల హెక్టార్ల వరకు వరి పంటే సాగు చేస్తారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో విత్తన శాంపిల్స్ 350 సేకరించాలన్నది లక్ష్యం కాగా అధికారులు ఇంతవరకు కేవలం 70 శాంపిల్స్ మాత్రమే సేకరించారు. ఇంకా 280 శాంపిల్స్ సేకరించాల్సి ఉంది.

విత్తనాల కొనుగోలు

జిల్లాలో ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద కొంతమంది, ప్రైవేట్ డీలర్ల వద్ద కొంతమంది విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. రైతులు పొలంలో విత్తనాలను సాగు చేసే ముందే విత్తనం నాణ్య మైనదో కాదో తెలియాలి. ఎందుకంటే విత్తనాన్ని పొలంలో చల్లిన తర్వాత అది నాణ్యమైనది కాకపోతే నష్టపోవాల్సి వస్తుంది. నాణ్యత లేని విత్తనాలు సాగు చేయడం వల్ల పంట ఎదుగుదల ఉండదు. రైతు పెట్టుబడి కూడా రాని పరిస్థితి.

విత్తన శాంపిల్స్ వివరాలు ఇన్‌సైట్ యాప్‌లో నమోదు

విత్తన శాంపిల్స్ సేకరించిన వెంటనే వివరాలను ఇన్‌సైట్ యాప్‌లో సంబంధిత మండల వ్యవసాయ అధికారి నమోదు చేస్తారు. యాప్‌లో నమోదు చేయగానే ఆ వివరాలు రీజనల్ కోడింగ్ సెంటర్‌కు వెళ్తాయి. తాడేపల్లిగూడం, తిరుపతి, అమరావతి, విశాఖపట్నంలలో కోడింగ్ సెంటర్లు ఉన్నాయి. కోడింగ్ సెంటర్‌కు శాంపిల్ వివరాలు రాగానే వాటిని కోడింగ్ సెంటర్‌లో ఉన్న డీడీ విత్తన పరీక్ష కేంద్రానికి పంపిస్తారు. విత్తన పరీక్ష కేంద్రాలు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, తాడేపల్లిగూడెం, అమరావతిలలో ఉన్నాయి. విత్తన పరీక్ష కేంద్రాల్లో పరీక్షించిన మీదట రిపోర్టులను విత్తన పరీక్ష కేంద్రం నుంచి కోడింగ్ సెంటర్‌కు పంపిస్తారు. అక్కడి నుంచి సంబంధిత జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి రిపోర్టు పంపిస్తారు. రిపోర్టులో నాణ్యత లేనివాటిపై వ్యవసాయ అధికారులు కేసులు నమోదు చేస్తారు.

నాణ్యత లేనివి విక్రయించే వారికి పడే శిక్ష

నాణ్యత లేని విత్తనాలు విక్రయించే వారికి 6 నెలల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అదేవిధంగా పురుగు మందులైతే 3 సంవత్సరాలు, ఎరువులైతే 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు స్పష్టం చేస్తున్నారు.

జంఝావతి పూర్తికి ఇదే మంచి సమయం

- జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

కొమరాడ: ఒడిశా చిక్కుముడితో ఉన్న జంఝావతి రిజ్వర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నిర్మించేందుకు ఇదే మంచి సమయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. కూటమి నాయకులతో కలిసి జంఝావతి రిజర్వాయర్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో సమస్య కొలిక్కివచ్చే అవకాశం ఉందన్నారు. ఒడిశాకు చెందిన 117 ఎకరాల భూమి ముంపుతో పాటు నిర్వాసితులుగా మారే 300 కుటుంబాల సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యేలతో కూడిన జంఝావతి సాధన కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తయితే మరో 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ గులిపిల్లి సుదర్శనరావు, జనసేన నాయకులు తెంటు శ్రీఖర్, గార గౌరీశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.